క్లుప్తంగా

బాలికల చదువుల పట్ల శ్రద్ధ వహించాలి



రాజుపాలెం: బాలికలు దేశానికే గర్వ కారణమని బాలికల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో మల్లికార్జునశర్మ కోరారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఆడపిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. బాలికల రక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన




క్రోసూరు: రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఈవీఎం యంత్రాల వినియోగం పట్ల బీఎల్‌వోలు, వీఆర్వోలు, పార్టీల నాయకులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ జియావుల్ హక్ బుధవారం తెలిపారు. మండలంలోని ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామాల్లో అవగాహన కల్పించటం జరిగిందన్నారు. పార్టీల గుర్తులు, వేసిన ఓటు సక్రమంగా పడిందా అనే విషయాలు తెలుసుకునే విధంగా మాక్ పోలింగ్ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ వినుకొండ డిపోలో డ్రైవర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బి. కోటేశ్వరరావు నాయక్ డ్రైవర్లకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో ఎంతో జాగ్రత్తగా ఉంటూ ప్రయాణీకుల ప్రాణాలను, కుటుంబాలను కాపాడే పవిత్రమైన వృత్తి డ్రైవర్‌దని, ఆర్టీసీ డ్రైవర్లు శిక్షణ కలిగి అత్యంత సురక్షితంగా విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్ జీవితం బీసీలకు ఆదర్శనీయం



నరసరావుపేట: దివంగత బీహార్ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు కర్పూరి ఠాకూర్‌కి భారతదేశ ప్రభుత్వ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించడం చాలా హర్షించదగ్గ విషయమని బీసీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో బుధవారం ఏపీ బొందిలి సంఘం రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి బొందిలి శ్రీనివాస్‌సింగ్, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు జి.సాంబశివరావు, గంజి జోగేశ్వరబాబు, బొందిలి సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు బొందిలి సీతారామసింగ్ మాట్లాడుతూ కర్పూరీ ఠాకూర్ శతజయంతి ఉత్సవాలు ప్రారంభానికి ఒక రోజు ముందు భారతరత్న ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో కర్పూరి గ్రామంలో ఒక పేద వ్యవసాయ రైతు కుటుంబంలో నాయీ బ్రాహ్మణ కులంలో జన్మించారన్నారు. బీహార్‌కి రెండుసార్లు ముఖ్యమంత్రిగా సేవలు అందజేశారని, వారి ఆధ్వర్యంలో బీసీల కోసం 26 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఆ స్ఫూర్తి మండల్ కమిషన్‌కు ప్రేరణగా నిల్చాయన్నారు.

పంటల సాగుపై సమీక్ష

క్రోసూరు: క్రోసూరులోని కటకం కల్యాణ మండపంలో క్రోసూరు సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, రైతుభరోసా సిబ్బందితో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కంది కొనుగోలు, మద్దతు ధరలపై అవగాహన కల్పించారు. సబ్‌డివిజన్ పరిధిలో సాగవుతున్న పంటల విస్తీర్ణం, పంట నమోదు, ఈ పంట ఈకేవైసీ, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల అమ్మకాలు, పంట కోత ప్రయోగాలు, వైఎస్సార్ యాప్ నిర్వహణ తదితర అంశాలపై సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

- నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే శంకరరావు
- పెదపాలెంలో రూ.4 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం



పెదపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, అధికారులు

అచ్చంపేట: ప్రజలకు విద్యుత్తు కోతల నుంచి ఉపశమనం అందించేందుకే పెదపాలెంలో రూ.4 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. బుధవారం ఆయన పలు గ్రామాలలో పర్యటించారు. నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్, గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సీసీ రోడ్లను ప్రారంభించారు. పెదపాలెంలో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా కొండూరు, నిండుజర్ల, పెదపాలెం, వేల్పూరు, గ్రంధశిరి, మిట్టపాలెం, రుద్రవరం, ఓర్వకల్లు తదితర గ్రామాలకు ఇకపైలో వోల్టేజి సమస్య ఉండదని, నిరంతరం విద్యుత్ సరఫరా అవుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. ఈ గ్రామాల రైతులకు 9 గంటల నింతర విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. త్వరలో అచ్చంపేటలో 130 కేవీ విద్యుత్ స్టేషన్ మంజూరు చేసేందుకు ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. ఇందుకోసం 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. అమరావతి మండలంలోని అత్తలూరు, చంద్రాజుపాలెం గ్రామాలకు సైతం విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయని త్వరలో నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు.

గ్రామ సచివాలయాలద్వారా గ్రామాలకు స్వరాజ్యం తెచ్చేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పలు గ్రామాలలో గ్రామ సచివాలయాల నూతన భవనాలను ప్రారంభించిన ఆయన తాళ్ల చెరువులో గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వమే ప్రజల వద్దకు వచ్చి సేవలను అందిస్తుందన్నారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు రూపాయి లంచం ఇచ్చే పనిలేకుండా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని చెప్పారు. దేశ చరిత్రలోనే సచివాలయ వ్యవస్థ పెను మార్పులు తీసుకువచ్చిందన్నారు. ఇంటింటికీ ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామ గ్రామాన విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలో సగానికి పైగా గ్రామాలలో హెల్త్‌క్లినిక్స్ ఏర్పాటు చేసి అందులో సిబ్బందిని నియమించి ఇంటింటికీ వైద్యసేవలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన కారుమూడి లూర్దు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఎమ్మెల్యే అతనిని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల సీయం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు.

మండలంలోని చింతపల్లి, పెదపాలెం గ్రామాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు జాతీయ బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు.

సీసీ రహదారి ప్రారంభం

మండలంలోని కోనూరు, చల్లగరి గ్రామాలలో రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత రహదారులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనికృష్ణా నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి సాతర్ల శ్రీనివాసరావు, ఎన్‌జీరంగా వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ మురళీకృష్ణ యాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు తనీరు శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజినీరు శివకోటిరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శేషప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

గ్రామాల్లో ఉరకలెత్తిన క్రీడోత్సాహం

- ఆడుదాం ఆంధ్రా పోటీలకు విశేష స్పందన
- విజేతలకు అధికారుల అభినందనలు

సత్తెనపల్లి: పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో సత్తెనపల్లి నిలువగా, ద్వితీయ స్థానం నకరికల్లు, తృతీయ స్థానం ముప్పాళ్ళ కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో సత్తెనపల్లి రూరల్, ద్వితీయ స్థానంలో నకరికల్లు, తృతీయ స్థానం ముప్పాళ్ళ కైవసం చేసుకున్నాయి. విజేతలను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎన్ సాంబశివరావు, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఏఓ బసవకుమారి, మండల చీఫ్ కోచ్ ఆరిక శ్రీరామ్ రెడ్డి, పీడీలు, నోడల్ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి ఎమ్మెల్యే ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: గ్రామస్థాయి నుంచే యువత క్రీడల్లో రాణించాలన్న ఉద్దేశ్యంతోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులు గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగేందుకు ఆడుదాం ఆంధ్రా ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు క్రీడాకారులతో కలసి కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ద్వితీయ స్థానంలో నిలిచిన నకరికల్లు క్రీడాకారులు



తృతీయ స్థానం సాధించిన ముప్పాళ్ళ క్రీడాకారిణిలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శంకరరావు



వాలీబాల్ ఆడుతున్న శంకరరావు

ఘనంగా బాలికా దినోత్సవం

బెల్లంకొండ: బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీడీవో వెంకటరెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని అన్ని గ్రామాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల హక్కులపై ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రమైన బెల్లంకొండలోని జెడ్పీ పాఠశాలలో బాలికల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాపాయపాలెం జెడ్పీ పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బెలూన్లు, గాలిపటాలు ఆకాశంలోకి ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

బాలికా సాధికారతతో దేశాభివృద్ధి

నకరికల్లు: బాలికలు దేశానికి గర్వ కారణమని బాలికా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ప్రధానోపాధ్యాయురాలు పాహిం అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని చేజర్లలోని ఎస్వీఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాజంలో అవగాహన కల్పించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. బాలికల పట్ల అసమానత్వం, వివక్షను అరికట్టాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు చిత్రలేఖనాలు, నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పఠాన్ మల్లిక, చెరుకూరి వెంకటేశ్వర్లు, గేరా మోహన్‌రావు, ఏపీహెచ్.వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్, ఎన్జీవోలు భారతి, రోజా, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థినులు చదువుపై శ్రద్ధ కనబరచాలి

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం రాజ్యాంగ ప్రవేశిక ముఖ్యాంశాలపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహించగా మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీబీఆర్‌సీ ద్వారా అంబేడ్కర్ ఫోటో ఎగ్జిబిషన్ విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫోటో ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషరెడ్డి, ఎస్పీ దయాన్ నాగమల్లేశ్వరరావు, పద్మావతి, సామ్రాజ్యమ్మ, వెంకటేశ్వరరావు, సుధారాణి, జ్యోతి కుమారి, రాధా కుమారి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి సహకరించాలి

అమరావతి: మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలు ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేసి అవకాశాలు అందిపుచ్చుకోవాలని శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాజేటి రాము అన్నారు. బుధవారం స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ పెద ఇమాంబి అధ్యక్షత వహించారు. మాజేటి రాము మాట్లాడుతూ గ్రామీణ కుటుంబ వ్యవస్థలో మార్పులు వస్తేనే సమాజంలో మార్పు కనిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది



చిత్రలేఖనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

నేడు క్రోసూరులో అభివృద్ధి పనులు ప్రారంభం

క్రోసూరు: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం మండలంలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కార్యక్రమాలకు హాజరవుతున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం బయ్యవరం గ్రామంలో గ్రామ సచివాలయం, క్రోసూరులో పునర్నిర్మాణం చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాలను ప్రారంభిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మహిళలకు వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చెక్కులు అందజేస్తారని తెలిపారు.

పశువైద్య శిబిరానికి స్పందన

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థినులతో నిర్వహించబడుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా బుధవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ముప్పాళ్ళ పశువైద్యులు కరుణాకర రెడ్డి పాల్గొని పశువులకు వైద్య సేవలందించారు. శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ క్యాంపు కోఆర్డినేటర్ డా.ఉషారాణి, డా.రత్నకుమారిలు పర్యవేక్షించారు.

ఘర్షణలతో జీవితాలు నాశనం



యడ్లపాడు: ప్రజలు గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులకు సహకారం అందించాలని యడ్లపాడు ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైదవోలు గ్రామాన్ని సందర్శించారు. ముందుగా గ్రామంలోని వీధుల్లో స్థానికులతో కలిసి పర్యటించి సమస్యల్ని తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ హాలు వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టామన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే పల్లెనిద్ర ముఖ్యోద్దేశం అన్నారు. ఘర్షణలు పడి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ గౌరీ లక్ష్మయ్య, స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ప్రారంభం

నాదెండ్ల: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించటంతో సమ్మె విరమించారు. మంగళ, బుధవారాల్లో నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి లోని యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట పట్టణం, రూరల్ పరిధిలో 267 అంగన్‌వాడీ సెంటర్లు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయ ని సీడీపీవో శాంతకుమారి తెలిపారు.

కర్పూరి ఠాకూర్ సేవలు మరువలేనివి



ఠాకూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: జన నాయక్‌గా ప్రసిద్ధి చెందిన మాజీ సీఎం, దివంగత కర్పూరి ఠాకూర్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘ నాయకులు కొనియాడారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో కర్పూరి 100వ జయంతి వేడుకలను బీసీ సంఘ నాయకులు ప్రత్తిపాటి హరే కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులు మాట్లాడుతూ ఆయన శత జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం గొప్ప విషయమన్నారు. సామాజిక న్యాయం కోసం నిరంతరాయంగా పోరాడిన కర్పూరి ఠాకూర్ కోట్ల మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు కొమ్మూరి ప్రసాద్, చిరంజీవి శ్రీనివాస్, కుమ్మరి దస్తగిరి, చింకా అంకమ్మరావు, పి.ప్రకాష్ రావు, పిక్కలి శివ, సతీష్, చావల వేంకటే శ్వర్లు, షేక్ చిన్న షరీఫ్, శేఖర్, కె.నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన

రాజుపాలెం: విద్యార్థులకు ఉపాధ్యాయులు రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించాలని దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం తెలిపారు. మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రాజ్యాంగంలోని ముఖ్యాంశాలపై బుధవారం ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ ఎం.చిన్నప్ప మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం గురించి తెలుసుకొనుటకు విద్యార్థులకు ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగుణమణి, ఉపాధ్యాయులు ఆదిలక్ష్మీ, లలిత, పద్మజ, విజయ, భూలక్ష్మీ, భ్రమరాంబ, రాజ్యలక్ష్మీ, రాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖోఖో పోటీలు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలు పట్టణంలోని ప్రగతి పాఠశాల ఆవరణలో గురువారం జరుగుతాయని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ పోటీలకు నియోజక వర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, నకరికల్లు, రాజుపాలెం మండలాల నుంచి బాల, బాలికల జట్లు వేరువేరుగా హాజరవుతాయన్నారు. పోటీల అనంతరం విజేతలను ప్రకటించడం జరుగుతుందని వివరించారు.

ఓటరు దినోత్సవం విజయవంతానికి పిలుపు

సత్తెనపల్లి: ఓటుహక్కు సక్రమ వినియోగం ద్వారా ప్రజాస్వామ్య విలువలను పెంచాలని సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్ బుధవారం కోరారు. గురువారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే 14వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బూత్ లెవల్ అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, స్వయం సహాయక గ్రూపు లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం అక్రమ అమ్మకాలపై కేసు నమోదు

ముప్పాళ్ళ: మద్యం అక్రమంగా అమ్మకాలు జరుపుతున్న వ్యక్తి వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అతని పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.కిశోర్‌బాబు బుధవారం తెలిపారు. మండలంలోని ఇరుకుపాలెంకు చెందిన మొగిలి సాంబశివరావు అనే వ్యక్తి ఇంట్లో మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతని ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో 12 మద్యం సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సాంబశివరావు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకేసారి పదిమందికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు

రోబోటిక్ సర్జన్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో డాక్టర్లు, ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో పుట్టుకతో మూగ, చెవుడుకు గురైన పదిమంది పిల్లలకు ఉచితంగా ఒకేసారి కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీలు విజయవంతంగా చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇది రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక రికార్డుగా ఆయన పేర్కొన్నారు. హాస్పిటల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పది మంది పిల్లలకు సర్జరీ చేసి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామన్నారు. ఈ పిల్లలకు సర్జరీలను సర్జన్ డాక్టర్ ఏపూరి రాజేష్ ఒక్కరే చేయడం మన రెండు తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని పేర్కొన్నారు. దీంతో ఆయన తన కెరీర్‌లో 50 సర్జరీలు పూర్తిచేశారన్నారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ 12 గంటలు పట్టే ఒక్కో సర్జరీ ఒక గంటలో పూర్తి చేశామన్నారు. ఒక సర్జరీ నుంచి మొదలుకొని ఈరోజు 50 మంది పిల్లలకు పూర్తిస్థాయిలో ఒక్క కాంప్లికేషన్ కూడా లేకుండా సర్జరీలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ రికార్డు చేసేందుకు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది కృషి, సహకారం మరువలేనిదన్నారు. సమావేశంలో ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు, డాక్టర్లు పాల్గొన్నారు.

నెట్‌బాల్, బాల్‌బాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటారు!

ఈపూరు: ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 23 తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల నెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగాల్లో కళాశాల విద్యార్థులు ప్రథమస్థానం సాధించినట్లు ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు బుధవారం తెలిపారు. ప్రథమ స్థానం పొందిన జట్టు నుంచి ఆల్ ఇండియా నెట్ బాల్ జట్టుకు బీపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కె.భానుప్రకాష్, కె.ప్రవీణ్, బీపీఈడీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్.రవితేజ, ఎంపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.సాల్మన్ రాజులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి

బెల్లంకొండ: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన బెల్లంకొండ క్రాస్ వద్ద మంగళవారం రాత్రి సమయంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ కె.అమీర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు పిడుగురాళ్లకు చెందిన షేక్ నన్నేసా సత్తెనపల్లి నుంచి తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. రాజుపాలెం మండలం చౌటపాపాయపాలెం ఆర్ఆర్ సెంటర్‌కు చెందిన చేవూరి నాగరాజు అనే వ్యక్తి రాజుపాలెం వైపు తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు అదుపు తప్పి వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నన్నేసా తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అతడిని హుటాహుటిన సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున నన్నేసా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.